# ప్రస్తుతం ఈ నంబరుతో ఏ చెలి ఫోనూ పని చేయడం లేదు

— పైడి తెరేష్ బాబు

పేగు తెంపినప్పటి బాధ
తల్లికీ బిడ్డకూ సమానమే
వాక్యాన్ని కొట్టేసినప్పటి బాధ
కలానికీ కాగితానికీ సమానమే

బాధే సౌఖ్యమనుకోవడం
అమరత్వపు కీర్తనలకింద చావును కప్పెట్టడం
నయా వంచనాశిల్పం

చెలీ! నీకు ఎండితునకల గోంగూర వండిపెడతా
నీ ప్రేమరాహిత్యం నన్ను కాల్చేసిన సంగతి
ఇకనైనా ప్రకటించు

తుపాకీ పేలినప్పటి హింస
తూటాకూ గుండెకూ సమానమే
వెదురుముక్కను నరికిన దుఃఖం
తల్లివేరుకి పిల్లంగోవికీ సమానమే

హింసనీ దుక్ఖాన్నీ
చిరునవ్వుకు పర్యాయపదాలు చేయడం
స్వీయకవితా ద్రోహం

సఖీ! నీకో గిద్దెడు ప్రభుత్వ సారా పోయిస్తాగానీ

నా జాతికి నన్ను విరోధిని చేసిన సత్యాన్ని
ఇకనైనా ప్రకటించు

పరిమళం హత్యకు గురైన వేదన
పువ్వుకూ కొమ్మకూ సమానమే
ఉలి దెబ్బకు ఉనికి మారిన రోదన
శిలకు శిల్పానికీ సమానమే

ప్రపంచంలో తలెత్తే ప్రతి సంక్షోభం
నా దేహం మీదే అంతం కావడం
యాదృచ్ఛికం అనడం నేరం

ఉద్యమకారుడా! నా రక్తమాంసాల్ని అనువదించి నీకో బెస్ట్‌సెల్లర్ నిస్తా
నన్ను ఐచ్ఛికంగా నువ్వు హత్య చేసిన సంగతి
ఇకనైనా ప్రకటించు

నమ్మకం నుంచి రాలిపోయిన వియోగభారం
సిద్ధాంతానికీ హృదయానికీ సమానమే
వాడుకుని వదిలేసినప్పటి మిగులు విలువ
విక్రేతకు వినియోగదారుడికీ సమానమే

పలకరింపునకు నోచుకోని అస్పృశ్యజీవిని
ఆలింగనం కోల్పోయిన బాహుబలిని
నా ఆనవాలుగా సారాబుడ్డిని చూపడం కుట్ర ప్రేయసీ!
నీ దేహానికి బాకీపడిన అద్దె పైకం చెల్లిస్తా

దేహాలకు ఆవల మనం సంచరించిన సరస్తీరాల గురించి
ఇకనైనా ప్రకటించు

గూడు తరిమినప్పటి గుండెకోత
గూటికీ పక్షికీ సమానమే
గింజలు రాలిపోయిన వలపోత
కంకికీ కంచానికీ సమానమే

గుక్కెడు ఆనందం కోసమే కదా దేబిరించాను
పిడికెడు ఆత్మగౌరవం కోసమే కదా
లోకానికి పగయ్యాను
అదీ తప్పేనంటావా

స్వాప్నికుడా! నీకు లక్ష డాలర్ల ప్రాజెక్ట్ రిపోర్ట్ రాసిస్తా
నా ఆకలి భిక్షాపాత్రకు అతీతమైనదనే సంగతి
ఇకనైనా ప్రకటించు

యోధుడు మరణించిన లోటు
యుద్ధానికీ దేశానికీ సమానమే
యూదా పొడిచిన వెన్నుపోటు
జాతికీ ఉద్యమానికీ సమానమే

వ్యూహాలు, ఎత్తుగడలు, ఉపరితలాలు, నిర్మాణాలు
రాజ్యాధికార నినాదాలు, కర్రపెత్తనపు కరపత్రాలు
మళ్ళీ నన్ను కంచికచర్ల కోటేశుని చేశాయి

చెలియరో! నీకో పోస్ట్ డాక్టోరల్ థీసిస్ రాసిస్తా
నా గొంతు నులిమిన మొదటి చెయ్యి నీదేనని
ఇకనైనా ప్రకటించు

*(కలేకూరి ప్రసాద్‌కి కడసారి జై భీమ్‌లతో...)*